# దండోరా

బాపయ్య పాతకాలం మనిషి.

మనిషి బక్కపల్చగా పొడుగ్గా వుంటాడు. అరవయ్యేళ్ళు మీదబడ్డా మనిషిలో నిస్సత్తువ లేదు. ఉషారుగా గ్రామాలన్నీ చుట్టేసి వస్తుంటాడు. నీరుకావి పంచె, అరచేతుల చొక్కా, తలకు కండువా, కాళ్ళకు కిర్రుచెప్పులు భుజాన వేలాడుతున్న డప్పుతో చుట్టుపక్కల గ్రామాల్లో ప్రత్యక్షమవుతాడు.

'మయూరి' సినిమాహాల్లో ఏం సినిమా వొచ్చిందో గ్రామాల్లో చాటింపువేస్తూ సినిమాపట్ల ఆసక్తి కలిగేటట్లు చేస్తూ వుంటాడు బాపయ్య.

బాపయ్య డప్పుమోత వినగానే పొలాలకు వెళ్ళే రైతన్నలు ఓ క్షణం ఆగి అతనేంచెబుతాడో విని నవ్వుకుంటూ ముందుకు సాగిపోతారు.

వంట పనిలో మునిగిపోయిన ఆడబడుచులు పొయ్యిమీద పెట్టిన కూర సంగతి మర్చిపోయి వీధి గుమ్మం దగ్గరే నిలబడతారు.

బడికి వెళ్ళే పిల్లలు అతనిచుట్టూ మూగుతారు.

"యన్టీవోడి సిన్మా... పాతాళభైరవి.... మళ్లీ మళ్లీ చూడాలనిపించే సిన్మా... కత్తి యుద్ధాలు... నేపాళ మాంత్రికుడి మాయలు.... పిల్లలు ఎగిరిగంతేస్తారు... పెద్దళ్లు వూపిరి తీసుకోవడమే మర్చిపోతారు. సిన్మా చూస్తూ వుంటే" అనేసి దప్పువాయిస్తూ ముందుకు సాగిపొతాడు.

చాలాదూరం పిల్లలు వెంబడిస్తారు బడి సంగతి మర్చిపోయి. సినిమా తాలూకు వివరాలున్న కాగితాలు పిల్లలకు పంచి, వాళ్ళందరూ తృప్తిపడేటట్లు డప్పు వాయించి, పిల్లలను వెనక్కు పంపి మరో గ్రామంవైపు నడకసాగిస్తాడు.

పదిహేనేళ్ళ నుంచి బాపయ్యకి అదే వ్యాపకం. సినిమాహాలు వోనరు అతనికి రోజుకి మూడురూపాయలిస్తాడు. టీ నీళ్ళకు, టిఫిన్‌కు వేరే చిల్లరే డబ్బులిస్తారు. హాల్లో ఎన్నిసార్లయినా ఉచితంగా అతను సినిమాలు చూడచ్చు.

ఒకప్పుడు బాపయ్య బాగా బతికినవాడే. కాడెద్దులు, ఎకరం నేల వుండేవి. సుఖంగానే వుండేవాడు. చెరువులో నీళ్లు వున్నప్పుడే అతని పొలం పండేది. వరుసగా ఐదేళ్ళు వానలు కురవకపోవడంతో పొలంమీద పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. అప్పుల్లో మునిగిపోయాడు.

పొలం, పశువులు, అప్పు యిచ్చిన శరభయ్యకు అమ్ముకోవాల్సి వొచ్చింది. నలుగురికి నాలుగు ముద్దలు అన్నంపెట్టే రైతు, రైతు కూలీ అయ్యేడు. ఆ పొలం పనులు సంవత్సరం పొడుగునా దొరక్క నానా ఇబ్బందులు పడ్డాడు.

బాపయ్య భార్య జబ్బుతో చనిపోయింది.

కొడుకు చదువు మధ్యలో ఆగిపోయింది. వాడెప్పుడో అడవుల్లోకి వెళ్ళిపోయేడు.

కొలువుల్లో, పండగల్లో సరదాగా వాయించడానికి నేర్చుకున్న డబ్బు వాయిద్యమే జీవనోపాధి అయ్యింది.

పిల్లలు చుట్టూచేరి నవ్వుతుంటే కష్టాలన్నీ మర్చిపోతాడు. పచ్చటి పొలాలు కన్పిస్తే ఆ పచ్చదనమంతా తనదిగానే భావించి తృప్తిపడతాడు.

ఊళ్ళన్నీ తిరిగి ఇంటికి తిరిగి వస్తుంటే మసకచీకట్లో సూర్యం కన్పించేడు. పదేళ్ల తరువాత మళ్ళీ కన్పించిన కొడుకును చూడగానే బాపయ్య ఎంతో సంబరపడ్డాడు.

కోడిని కొనుక్కుని కోడిమాంసం వొండిపెట్టాడు కొడుక్కి. పరధ్యానంగా నాలుగు మెతుకులు కతికి లేచిపోయిన సూర్యాన్ని చూస్తుంటే గుండె తడుక్కుపోయింది బాపయ్యకు.

"వాళ్ళమ్మ వుంటే ఈడిట్లా తయారయ్యేవాడా?" తనలో తానే గొణుక్కున్నాడు.

సూర్యం బాగా చిక్కిపోయాడు. గడ్డం పెంచేశాడు. ఎప్పుడూ ఏవో ఆలోచనలతో సతమతమవుతూ వుంటాడు.

"వూళ్ళో మార్పులు గమనించావా నాన్నా! శరభయ్యలాంటివాళ్ళు మేడలు, మిద్దెలు కట్టుకుంటున్నారు... మనమేమో వున్న పొలాలు అమ్ముకుని కూలిబతుకులు బతుకుతున్నాం" అన్నం తినేసి పాకబయట మంచం వేసుకుంటూ అన్నాడు సూర్యం.

"వాడి అదృష్టం అలా వుంది. మన తలరాత యిట్లా వుంది. మన చేతుల్లో ఏమీ లేదురా" అనేశాడు బాపయ్య.

"మీరందరూ చేతులు ముడుచుకుని కూర్చోబట్టే వాడి ఆటలు సాగుతున్నాయి. కూలీలకు న్యాయంగా రావాల్సిన కూలీ డబ్బులు ఇవ్వటంలేదు. పొలం పనికి వచ్చే ఆడవాళ్లు వాడి కామదాహానికి బలి అవుతున్నారట. వడ్డీ వ్యాపారంచేస్తూ ప్రజల రక్తం పీల్చి పిప్పిచేస్తున్నాడట.... శరభయ్య పాపాలన్నీ మా దళం దృష్టిలోకి వొచ్చేయి.... ఇక తప్పించుకోలేడు" అన్నాడు సూర్యం ఆవేశంగా.

"పోనీద్దూ.... వాడిని సిచ్చించడానికి పైన ఆ భగవంతుడున్నాడు లేరా! వాడి సంగతి మనకెందుకుగాని నీ సంగతులు చెప్పరా? ఇన్నాళ్ళబట్టి ఏడుంటున్నావ్? ఏం తింటున్నావ్? మీ అమ్మ వుంటే నువ్విట్టా దేశం పట్టుకు తిరిగేవాడివా?" సూర్యం మంచం పక్కనే గోనెపట్టా పరుచుకుంటూ అడిగేడు బాపయ్య.

"ఈ రాత్రితో ఈ వూరికి పట్టిన శని వొదిలిపోతుంది. శరభయ్య కబంధ హస్తాల నుండి ఈ వూరి ప్రజలకు విముక్తి లభిస్తుంది. పెట్టుబడిదారి వ్యవస్థ ఉక్కు కౌగిలిలో బిగుసుకుపోయి ఊపిరాడని అభాగ్య జనానికి ప్రాణవాయువులు పోయడమే మా దళం ధ్యేయం."

ఆ చీకట్లో కూడా అతను మండిపోతున్నట్లుగా కన్పించేడు బాపయ్యకు. కొడుకుధోరణి అర్థమయ్యింది. శరభయ్యను తలుచుకోగానే అదురుపుట్టింది.

"శరభయ్య కర్కోటకుడురా! వాడి జోలి మనకెందుకుగాని హాయిగా పడుకుని పొద్దున్నే.... నీ దారిని నువ్వుపో.... ఊళ్ళో గొడవల్లో తలదూర్చక"

"ఉదయాన్నే నీకు చెప్పకుండానే వెళ్ళిపోతాను.... నాకు చాలా ముఖ్యమైన పనులున్నాయి.... నువ్వు కూడ పడుకో" అన్నాడు సూర్యం.

వూరు సద్దుమణిగేవరకూ వో రెండుగంటలు విశ్రాంతి తీసుకోవడం మంచిదనుకుని కళ్ళు మూసుకుని నిద్రకు ఉపక్రమించేడు సూర్యం.

ఏదో తెలియని భయం బాపయ్య గుండెను నొక్కిపట్టింది. కొడుకు నిద్రపోయాడని నిర్ధారణ చేసుకున్నాక పక్కమీద నుంచి లేచాడు.

పాకలోకి వెళ్ళి సూర్యం వెంట తెచ్చుకున్న చేతి సంచి తడిమిచూశాడు.

కోడిగుడ్డుదీపం వెలిగించి వొత్తి సన్నగా చేసి ఆ గుడ్డి వెలుతురులో సంచిలోని వస్తువులు పరీక్షగా చూసేడు.

ఏవేవో పుస్తకాలు, పాతగుడ్డల మధ్య పెట్టిన నాటుబాంబులు, వో పెద్ద కత్తి, ఆ సంచిలో వున్నాయి.

కొడుకు ఏదోదారుణానికి వొడిగట్టబోతున్నాడనితెలిసి అతని మనస్సు క్షోభించింది.

మనిషిని చంపితే మార్పు వొస్తుందా? వో శరభయ్య చనిపోతే మరో శరభయ్య పుట్టుకస్తాడు... సూర్యం ఏవో పిచ్చిభ్రమల్లో వున్నట్లున్నాడు... తప్పుదోవలో నడుస్తున్నాడు....

రెండు క్షణాలు ఆలోచించి సంచిలోని నాటుబాంబులు, కత్తితీసి ఇంటి చూరులో దాచిపెట్టాడు. తోటలో కోసుకొచ్చిన జామకాయలు సంచిలో పడేసి, ఏమీ ఎరుగనివాడిలా వొచ్చి తన పక్కమీద పడుకున్నాడు బాపయ్య. వో రాత్రివేళ సూర్యంలేచి సంచి తీసుకుని బయటకు వెళ్ళడం గమనించాడు.

❖ ❖ ❖

తెల్లవారింది. ఊరంతా ప్రశాంతంగా వుంది.

ఇంటిముందు అరుగుమీద కూర్చుని రాజకీయాలు మాట్లాడుతున్న శరభయ్య కన్పించేడు బాపయ్యకి. బాపయ్యని చూసి వెకిలి నవ్వు నవ్వాడు శరభయ్య.

అతని మనస్సు స్థిమితపడింది శరభయ్యని చూడగానే.

స్థిమితపడ్డ మనస్సు కల్లోలం కావడానికి ఎంతోసేపు పట్టలేదు.

పూరిబయట సూర్యం శవం కాలువలో నీళ్ళలో తేలితూ కన్పించింది.

'కాలుజారి కాలువలో పడి వుంటాడు' అనుకున్నారు వూళ్ళోవాళ్ళు.

కొడుకును చంపినదెవరో అర్థంచేసుకున్నాడు.

శరభయ్య వెకిలి నవ్వు అర్థం యిప్పుడు తెలుసుకున్నాడు.

అతని హృదయం మూగపోయింది.

"శరభయ్య నిన్ను పోలీసులకు అప్పజెబుతాడనుకున్నానుగాని, నిన్ను యిలా దారుణంగా హత్యచేస్తాడని అనుకోలేదురా!" తనలో తానే గొణుక్కున్నాడు.

❖ ❖ ❖

బాపయ్య దప్పు మూగవోయింది.

అతను అందరితో మాట్లాడటం మానేశాడు. అతనికి పిచ్చిపట్టిందన్నారు వూళ్ళో కొందరు.

ఎవరన్నా దయదలచి ఏదన్నా తెచ్చియిస్తే తినడం, చెట్లు పుట్టలు పట్టుకుని తిరగడం బాపయ్య చేస్తున్న పని.

రోజులు గడిచిపోతున్నాయి.

తెల్లటి సిల్కులాల్చీ, దోవతి కట్టుకుని మామిడితోటలో విహారానికి వొచ్చేడు శరభయ్య. తోటకాపలాదారుడు కూతురు మంగి పక్కనుండటంతో అతనిలో ఉషారు ఎక్కువైంది.

మంగితో పరాచికాలు ఆడుతూ తోటంతా కలియదిరుగుతూ వున్నాడు.

"దప్పిక అవుతున్నదే.... మీ అయ్యకు చెప్పి కొబ్బరిబొండాలు కొట్టించుకుని తీసుకురా.... ఇద్దరం కలిసి తాగుదాం" అన్నాడు శరభయ్య.

రివ్వున పరుగెత్తింది. మంగి తోటలో వో మూలవున్న పాకవైపు.

మొన్న కురిసిన వర్షాలకు బావిలోకి నీళ్ళు వొచ్చాయి. రాతిగట్టుమీదకు ఎక్కి బావిలోకి తొంగిచూస్తూ సిగిరెట్టు వెలిగించేడు విలాసంగా.

బావిపక్కనే వున్న పొదల పక్కన కూర్చుని వుంది ఓ మానవ ఆకారం. ఆ వ్యక్తి కళ్ళల్లో శరభయ్యపడ్డాడు.

ఇప్పుడా ఆకారం చీమకు కూడా అపకారం తలపెట్టని పాతకాలంనాటి మనిషిది కాదు. నివురుగప్పిన నిప్పులా ప్రతీకారం తీర్చుకోవడానికి అవకాశంకోసం ఎదురుచూస్తున్న వో ముసలి వ్యక్తిది.

ఎలుగుబంటిలా చప్పుడు కాకుండా వొచ్చి బలమంతా వుపయోగించి శరభయ్యని ఓ తన్ను తన్నాడు.

బావిలో పడ్డాడు శరభయ్య. తల రాతిమెట్టుకు కొట్టుకుని చిదురు, చిదురయ్యింది.

ఓ క్షణం ఆక్రందన-

నీళ్ళ చప్పుడు-

మరో క్షణంలో నీళ్ళలో తేలియాడుతున్న శరభయ్య శవం.

శరభయ్య శవాన్ని తృప్తిగా చూసి అక్కడ నుంచి వూళ్ళోకి పరుగెత్తింది మానవాకారం.

కొబ్బరిబోండాలు తెచ్చిన మంగికి దిగుడుబావి దగ్గర శరభయ్య కన్పించలేదు. కంగారుగా బావిలోకి తొంగి చూసింది.

నీళ్ళలో శరభయ్య శవం చూసి భయంతో వణికిపోయింది. ఆ విషయం తండ్రికి చెప్పడానికి పరుగెత్తింది మంగి.

❖ ❖ ❖

చాలారాజుల తరువాత మళ్ళీ డబ్బు భుజాన తగిలించుకున్నాడు బాపయ్య.

ఆవేశంతో వూగిపోతూ డబ్బు మోగిస్తున్నాడు.

గమ్యంలేకుండా వీధులన్నీ తిరిగేడు.

పిల్లలు, పెద్దలు చుట్టూ చేరేరు.

"ఏం సినిమా?"

"యన్టీవోడిదేనా? నాగేస్సర్రావుదా?" నోట్లో నుంచి మాట పలూకూలేదు.

వీరావేశంతో డప్పు మోగిస్తూనే వున్నాడు.

ఆకాశం చెవులు మూసుకుంటున్నది ఆ శబ్దానికి భయపడి.

- ఈనాడు ఆదివారం, 3 సెప్టెంబరు 1989